




పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో రామ భజన చేస్తున్న భక్తులు

సర్వం రామమయం


అయోధ్య బాలరాముడు..

పాలవెంకటాపురం కోదండరాముడు..



పాలవెంకటాపురంలో ప్రతిష్ఠించిన విగ్రహాలు

కళ్యాణదుర్గం, జనవరి 21: అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరుపుకోనున్న బాలరాముడి విగ్రహానికి, బ్రహ్మసముద్రం మండలం పాలవెంకటాపురం గ్రామంలో ప్రతిష్ఠించిన కోదండరాముడి విగ్రహానికి ప్రత్యేక అనుబంధం ఉంది. అయోధ్య బాలరాముడు, పాలవెంకటాపురం కోదండరాముడి విగ్రహాల శిల్పి అరుణ్ యోగిరాజ్ కావడం విశేషం. ఐదేళ్ల క్రితం పాలవెంకటాపురంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను అరుణ్ యోగిరాజ్ చెక్కారు. ఆయన మైసూరు ప్రాంతానికి చెందినవారు. అయోధ్య బాలరాముడి విగ్రహాన్ని చెక్కే బాధ్యతను ట్రస్టు అరుణ్ యోగిరాజ్‌కు అప్పగించింది. ఆ మేరకు ఆయన తన బాధ్యతను పూర్తి చేసి, సుందరమైన బాలరాముడి విగ్రహాన్ని సిద్ధం చేసి, అయోధ్య ట్రస్టుకు అప్పగించారు. పాలవెంకటాపురం రామాలయంలో ప్రతిష్ఠించిన విగ్రహం అయోధ్య బాలరాముడి విగ్రహం దాదాపు ఒకే రకంగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. దీంతో అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించేందుకు పాలవెంకటాపురంలో ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్ర్కీన్ ఏర్పాటు చేశారు. సోమవారం ఆలయానికి వచ్చే భక్తులందరికీ అన్నదానం చేయనున్నట్లు ధర్మకర్త డాక్టర్ లింగారెడ్డి, గ్రామప్రజలు పేర్కొన్నారు.



శిల్పి అరుణ్ యోగిరాజ్

అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఆలయాల్లో విశేష పూజలు

అనంతపురం కల్చరల్, జనవరి 21: అయోధ్య రామమందిరంలో సోమవారం నిర్వహించనున్న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఎటుచూసినా రామనామమే వినిపిస్తోంది. అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వేడుకలను ప్రారంభించారు. ఆదివారం పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆధ్వర్యంలో రాములవారి చిత్రపటంతో పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు. సున్నపువీధి రామాలయంలో రాములవారికి నదీజలాలతో అభిషేకాలు, పూజాది కైంకర్యాలు నిర్వహించారు. 2వ రోడ్డులో చంద్రశేఖరేంద్ర సరస్వతి జ్ఞానపీఠం ఆవరణలో రామతారకమంత్ర హోమం నిర్వహించారు. మధ్యాహ్నం దాదాపు 400 మందికి అన్నదానం చేశారు. సోమవారం ఉదయం కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించడంతోపాటు మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రాముల వారి కల్యాణోత్సవం, రెవెన్యూ కాలనీ రామాలయం, శారదానగర్‌లోని శంకరమఠంలో రామతారక హోమం, శ్రీమహావిష్ణు హోమాలు నిర్వహించనున్నారు. అదేవిధంగా పలు ఆలయాల వద్ద అయోధ్య రాముడి విగ్రహ ప్రతిష్ఠను వీక్షించేందుకు ఎల్‌ఈడి స్ర్కీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి

కన్నీళ్లు తెప్పిస్తున్న జగన్ మాకొద్దు.. 41వ రోజూ నిరసనలు.. కొన్నిచోట్ల సమ్మె శిబిరాల తొలగింపు



కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాలు చేస్తున్న నేతలు

అనంతపురం విద్య, జనవరి 21: అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. 41 రోజులుగా అంగన్వాడీలను కన్నీళ్లు పెట్టిస్తున్న జగన్ మాకొద్దంటూ పేర్కొన్నారు. సమ్మెలో భాగంగా అనంతపురం కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ కోటి సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు విధుల్లో చేరాలంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పోలీసులు సైతం అధికార పార్టీ సేవలో తరిస్తున్నారన్నారు. ఉరవకొండకు వెళ్లకూడదంటూ పోలీసులు నోటీసులిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీ పరిస్థితులు ఉన్నాయన్నారు. ప్రభుత్వం తీరుమార్చుకోకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు జమున, అరుణ, రుక్రిణి, పార్వతి, రమాదేవి, షబానా, సీఐటీయూ నేతలు రామాంజినేయులు, వెంకటనారాయణ, బాల రంగయ్య, పోతులయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

12 మంది అంగన్‌వాడీలపై కేసు

ఉరవకొండలో మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకున్నారని 12 మంది అంగన్‌వాడీలపై కేసులు నమోదు చేశారు. స్థానిక తహసీల్దార్ ఫిర్యాదు మేరకు 12 మందిపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఉరవకొండ, పెద్దవడుగూరు, యల్లనూరు ప్రాంతాల్లో అంగన్‌వాడీల సమ్మె టెంట్లను తొలగించారు.

ఆడుదాం ఆంధ్రాలో రచ్చ

నిరసనగా జగన్ బొమ్మ ఉన్న టీషర్టుల దహనం



టీషర్టును కాల్చేస్తున్న క్రికెటర్లు

కణేకల్లు, జనవరి 21: ఆడుదాం ఆంధ్రాలో గొడవల పరంపర సాగుతోంది. కణేకల్లులో క్రికెట్ పోటీల ఫైనల్ నిర్వహించారు. కణేకల్లుకు చెందిన నేసేపేట టీం, ఆర్డీటీ జట్లు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన నేసేపేట జట్టు 22 ఓవర్లలో 25 పరుగులు చేసి రెండు వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో ఇర్ఫాన్ బ్యాటింగ్‌కు వచ్చాడు. బౌలర్ వేసిన బంతి ఇర్ఫాన్ భుజానికి తగిలి కీపర్ చేతికి వెళ్లింది. దీన్ని ఆర్డీటీ జట్టు క్రీడాకారులు ఔట్ ఇవ్వాలని అంపైర్‌ను కోరగా మెయిన్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించాడు. లెగ్ అంపైర్ ఔట్‌గా ప్రకటించడంతో ఇరుజట్ల మధ్య వివాదం ప్రారంభమైంది. దీన్ని పరిష్కరించాల్సిన ఎంపీడీఓ ఏకపక్షంగా లెగ్ అంపైర్ ఇచ్చిన ఔట్ నిర్ణయాన్నే పాటించాలని నేసేపేట టీంకు ఖరాఖండిగా చెప్పారు. వారు అంగీకరించకపోవడంతో ఆర్డీటీ జట్టును విజేతగా ఎంపీడీఓ ప్రకటించి, కప్ అందజేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. నేసేపేట క్రీడాకారులు నిరసన తెలిపారు. జగన్ బొమ్మ ఉన్న టీషర్టులను దహనం చేశారు. రీమ్యాచ్ నిర్వహించాలని కోరారు.

స్పందన రద్దు

అనంతపురం టౌన్, జనవరి 21: కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించాల్సిన జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టరు గౌతమి తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తున్న నేపథ్యంలో స్పందనను రద్దు చేశామని, ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టరు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

ప్రభుత్వ పతనం ఖాయం

సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, జనవరి 21: అంగన్‌వాడీల డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించకుండా నియంతృత్వంగా వ్యవహరిస్తోందని, ఈ ప్రభుత్వానికి పతనం ఖాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఉరవకొండ, యల్లనూరు ప్రాంతాల్లో సమ్మె శిబిరాలను పోలీసులు తొలగించడాన్ని రాంభూపాల్ తీవ్రంగా ఖండించారు. సమ్మెకు మద్దతుగా కోటిమంది ప్రజలతో సేకరించిన సంతకాలను ముఖ్యమంత్రికి ఇచ్చేందుకు బయలుదేరుతున్న అంగన్వాడీల ఇళ్లవద్దకు పోలీసులు వెళ్లి నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ నియంతృత్వానికి పరాకాష్ఠ అని పేర్కొన్నారు. ఐసీడీఎస్ అధికారులు, స్థానిక వైసీపీ నేతలు ఫోన్‌లలో అంగన్వాడీ కార్యకర్తలను బెదిరిస్తున్నారని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోరడం అంగన్వాడీలు చేసిన నేరమా..? అని ప్రశ్నించారు. అంగన్వాడీల సమ్మెను అణచివేస్తే వైసీపీ ప్రభుత్వానికి పతనం ఖాయమన్నారు.

నేడే ఓటర్ల తుది జాబితా

- జిల్లావ్యాప్తంగా లక్షల్లో అభ్యంతరాలు
- ఆధారాలతో ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదులు
- వాటిని పరిష్కరిస్తారా.. లేదా...
- రాజకీయపార్టీలు, ఓటర్లలో ఉత్కంఠ



తప్పులతడకగా పాత ముసాయిదా జాబితా

అనంతపురం టౌన్, జనవరి 21: ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదల చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి, కలెక్టరు ప్రకటించారు. ఇది రాజకీయ పార్టీలు, ఓటర్లలో ఉత్కంఠ రేపుతోంది. గత ఏడాది అక్టోబరులో ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. జిల్లాలో మొత్తం 19,79,775 మంది ఓటర్లు ఉన్నట్లు చూపారు. ఇందులో 9,87,727 మంది పురుషులు, 9,91,816 మహిళలు, 232 మంది ఇతరులు ఉన్నారు. అయితే ఈ ముసాయిదా ఓటర్ల జాబితాపై అనేక అభ్యంతరాలు, ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లా అధికార యంత్రాంగం తీరుపై ప్రతిపక్ష టీడీపీ, ఇతర పార్టీలు తీవ్రంగా తప్పు పట్టాయి. ఇంటింటి సర్వేలో అనేక బోగస్ ఓట్లతో పాటు చనిపోయిన, వలసలు వెళ్లిన, డబుల్ ఎంట్రీ ఓట్లను ఆధారాలతో తెలిపినా వాటిని ముసాయిదా జాబితాలో అలాగే ఉంచారనే ఆరోపణలున్నాయి. అధికార వైసీపీ నేతల సూచన మేరకు అధికారులు టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించడంతో పాటు అధికార పార్టీ వర్గీయుల బోగస్ ఓట్లను అలాగే జాబితాలో ఉంచారనే విమర్శలు వెల్లువెత్తాయి. వైసీపీ నాయకులు ఏమి చేసైనా గెలవాలనే లక్ష్యంతో ఇలా అనేక అడ్డదారులు తొక్కుతూ ఓటర్ల జాబితాలో అనేక అక్రమాలకు పాల్పడుతోందని టీడీపీ నాయకులు మొదటి నుంచీ విమర్శిస్తూనే ఉన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి ఈ అక్రమాలకు వారు సహకరిస్తున్నారని పలు ఫిర్యాదులూ చేశారు. టీడీపీ సానుభూతిపరుల ఓట్లను తొలగించారని టీడీపీ నాయకులు పలుచోట్ల ఆందోళనలూ చేపట్టారు. ఉరవకొండ, రాప్తాడు, రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, అనంతపురం నియోజకవర్గాల్లో ఈ ఆరోపణలు పెద్దఎత్తున వినిపించాయి. ఇప్పటికీ ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో ఓటర్ల జాబితాలో అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి.

వెంటాడుతున్న ఉరవకొండ గుబులు

ఉరవకొండ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఆధారాలతో పీఏసీ చైర్మన్, టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై స్పందించిన కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు నేరుగా ఉరవకొండకు వచ్చి విచారణ చేశారు. కొందరు అధికారులు ఎన్నిక నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని తేలడంతో ఇద్దరు జడ్పీ సీఈఓలను సస్పెండ్ చేయడంతో పాటు వందలాది మంది బీఎల్‌ఓలకు నోటీసులు జారీ చేసిన విషయం తెల్సిందే. అప్పటి నుంచి జిల్లాలో ఎన్నికల అధికారులు అధికార పార్టీకి అండగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ రాష్ట్ర నేతలు సైతం రాష్ట్రంలో కొందరు కలెక్టర్లపై ఫిర్యాదు చేశారు. అందులో అనంత కలెక్టరు కూడా అధికార పార్టీకి మద్దతుగా బోగస్ ఓట్లను ఎక్కిస్తూ.. టీడీపీ ఓట్లను తొలగిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

గత నెలలో కేంద్ర ఎన్నికల కమిషన్ కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని.. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించింది. పదిరోజుల క్రితం కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ నేతృత్వంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో ఓటర్ల జాబితా, ఫిర్యాదులు, ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అందులోనూ అనంతలో ఓటర్ల ఫిర్యాదులు, ఇక్కడ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు మీడియాల్లో ప్రచారం సాగింది. ఇకనైనా మారకపోతే కఠిన చర్యలు తప్పవని ఘాటుగా హెచ్చరించినట్లు తెల్సింది.

లక్షల్లో ఫిర్యాదులు పరిష్కరించారా..?

జిల్లాలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై లక్షల్లో ఫిర్యాదులొచ్చాయి. అధికారిక లెక్కల ప్రకారమే ఫారం-6 ఫిర్యాదులు 1,18,633 వచ్చాయి. అలాగే అత్యంత వివాదస్పదంగా మారిన ఫారం-7 క్లెయిమ్స్ 86,775, ఫారం-8 ఫిర్యాదులు 1,20,858 వచ్చాయి. ఈ ఫిర్యాదులన్నింటిని పరిశీలించామని అధికారులు చెబుతున్నారు. అయితే ఇప్పటికీ ఓటర్ల జాబితా విషయంలో అధికారులు ఎన్నికల నిబంధనలు పాటించడం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తూనే ఉన్నారు. సోమవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తుండటంతో ఈ జాబితాలోనైనా అధికారులు సక్రమంగా ఫిర్యాదులు పరిష్కరించారా లేక అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గారా అని అందరిలోనూ ఉత్కంఠ మొదలైంది.

వైసీపీకి ఓటేస్తే రాష్ట్రం సర్వనాశనమే

మాజీ మంత్రి పరిటాల సునీత



మీడియాతో మాట్లాడుతున్న పరిటాల సునీత

అనంతపురం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తే ఇక రాష్ట్రం సర్వనాశనమేనని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. పన్నులు, చార్జీల పేరుతో మోయలేని భారాన్ని మోపిన చరిత్ర వైసీపీ ప్రభుత్వానిదేనన్న విషయాన్ని గుర్తించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మద్యపాన నిషేధం చేస్తానని గొప్పలు చెప్పి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలను బలిగొంటున్న జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆమె ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలకు ఈ విషయం బోధపడిందన్నారు. పన్నులు, చార్జీల పేరుతో ప్రజల రక్తాన్ని పీలుస్తోందని ప్రభుత్వంపై మండిపడ్డారు. పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజలు సంతోషంగా పండుగలు చేసుకునేందుకు తమ ప్రభుత్వ హయాంలో కానుకలు అందించి వారి జీవితాల్లో ఆనందాన్ని నింపామన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ప్రజలు పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. మద్యపాన నిషేధం చేస్తామని ఊదరగొట్టిన జగన్ ఐదేళ్ల పాలన పూర్తవుతున్నప్పటికీ నిషేధం ఏమోగానీ... అదే మద్యంతో ప్రజలను రక్తంలా తాగేస్తున్నాడని మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచలేదన్నారు. అదే జగన్ ప్రభుత్వం కరెంటు, ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలపై మరింత ఆర్థిక భారాన్ని మోపారన్నారు. చివరకు చెత్తపై పన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది జగనేనన్నారు. నాలుగేళ్లు వర్షాలు కురిసినా వ్యవసాయానికి నీరు అందించలేదని అసమర్థ ముఖ్యమంత్రి జగన్ అని విమర్శించారు. ఉపాధి కోసం నేటికీ వలసలు వెళ్లి బలకాల్సి వస్తోందంటే అది ప్రభుత్వ నియంతృత్వ పాలనకు అద్దం పడుతోందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు ఎమ్మెల్యేలు భూకబ్జాలు, దందాలు చేస్తూ రూ.కోట్లు గడిస్తున్నారని విమర్శించారు. రాజకీయాల్లో నమ్మిన వారికే మోసం చేస్తూ చివరికి చెల్లికి కూడా అన్యాయం చేశారన్నారు. విలువలు లేని వ్యక్తులు రాజకీయాలకు అనర్హులని ఆమె జగన్ తీరుపై మండిపడ్డారు. నిజాయితీతో రాజకీయాలు చేసే వ్యక్తులు ఈ రాష్ట్రానికి అవసరమన్నారు. ఆ నిజాయితీ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వైసీపీ అవలంభిస్తున్న విధానాలు చూసిన తర్వాతనే ప్రజలను రక్షించాలన్న ఉద్దేశంతో చంద్రబాబు పోరాడుతున్నారన్నారు. చంద్రబాబు వస్తేనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కురబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగుల కుంట రమణ, రాప్తాడు కన్వీనర్ కొండప్ప, నాయకులు బోయ జయరాములు, గద్దుపాటి శ్రీనివాసులు, తిరుపాల్ పాల్గొన్నారు.

మత్తులో డిజిటల్ లావాదేవీలు

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాయ..!

- ఎనిమిది నెలల క్రితం కొత్త విధానం అమలు
- డిజిటల్ యంత్రాలున్నా పనిచేయని వైనం
- మరికొన్ని చోట్ల అరకొరగా పేమెంట్లు
- మందుబాబులకు తప్పని చిల్లర కష్టాలు
- కొరవడిన ఎక్సైజ్ యంత్రాంగం పర్యవేక్షణ



మద్యం దుకాణంలో డిజిటల్ యంత్రం

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే దశల వారిగా మద్య పాన నిషేధం అమలు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగన్‌రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని తుంగలో తొక్కారు. మద్యపాన నిషేధం అమలు చేయకపోవ డాన్ని అటుంచితే... ప్రభుత్వమే మద్యం దుకాణాల నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు.

అనంతపురం అర్బన్

అరకొరగా డిజిటల్ లావాదేవీలు

జిల్లాలోని అనంతపురం నగరంలోని కొన్ని దుకాణాలతో పాటు పలు పట్టణాలు, హైవే సమీపంలోని దుకాణాల్లో మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నట్లు సమాచారం. మరికొన్ని దుకాణాల్లో అరకొరగా నగదు రహిత లావాదేవీలు చేస్తున్నట్లు తెలిసింది. యంత్రాలు సరిగా పనిచేయకపోవడం, యంత్రాలకు సిబ్బంది చార్జింగ్ సరిగా పెట్టకపోవడం, నెట్‌వర్క్ సమస్యలతో డిజిటల్ లావాదేవీలు జరగడం లేదు.

చిల్లర కష్టాలు

అనంత ఉమ్మడి జిల్లాలో 192 ప్రభుత్వం మద్యం దుకాణాలున్నాయి. ఇందులో అనంతపురం జిల్లాలో 127, సత్యసాయిలో 65 ఉన్నాయి. అలాగే ఏడు మాల్స్ నడుస్తున్నాయి. మరోవైపు బార్ అండ్ రెస్టారెంట్లు అనంతపురంలో 18, సత్యసాయిలో 10 ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లల్లో మొదటి నుంచి డిజిటల్ లావాదేవీలే జరుగుతున్నాయి. ప్రభుత్వం మద్యం దుకాణాల్లో ఆలస్యంగా గత ఏడాది ఏప్రిల్ నుంచి డిజిటల్ పద్ధతిని అమలు చేసింది. ఉమ్మడి జిల్లాలో సగానికి పైగా మద్యం షాపుల్లో డిజిటల్ లావాదేవీలు జరగడం లేదు. ఆయా ప్రాంతాల్లోని మద్యం దుకాణాల్లో డిజిటల్ యంత్రాలు ఉన్నప్పటికీ ఎలాంటి ప్రయోజనమూ లేదని తెలిసింది. ఫోన్ పే, గుగూల్ పే ద్వారా డబ్బులు వేస్తామని మందుబాబులు అడిగినా మిషన్ పని చేయడం లేదని సిబ్బంది చెబుతున్నట్లు తెలిసింది. చిల్లర డబ్బులు మిగిలించుకోవడానికి దుకాణంలోని సిబ్బంది కావాలనే ఇలా చేస్తోందని మందుబాబులు వాపోతున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లే ఈ దుస్థితి ఉందని మండిపడుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ లావాదేవీలు అమలు చేయడంపై నిర్లక్ష్యం జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిసింది. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణా లోపమే ఇందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదంతా చూస్తుంటే ప్రభుత్వం నామమాత్రంగానే ఈ యంత్రాలు పెట్టిందని స్పష్టమవుతోంది. ఇప్పటికైనా ఆ శాఖ యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని మద్యం దుకాణాల్లో తప్పనిసరిగా డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



డిజిటల్ యంత్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

తగిన చర్యలు

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ పద్ధతిలో లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. గత ఏడాది ఏప్రిల్ నుంచే కొత్త పద్ధతిని ప్రభుత్వం అమలు చేసింది. అన్ని దుకాణాలకు యంత్రాలు సరఫరా చేశాం. ఎక్కడైనా డిజిటల్ పద్ధతిలో ఫోన్ పే, గుగూల్ పే ద్వారా డబ్బులు తీసుకోకపోతే తక్షణమే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

- రామమోహన్‌రెడ్డి, ఐఎంఎల్ ఇన్‌చార్జి డిపో మేనేజర్, అనంతపురం

వ్యాయామం.. జీవితంలో భాగం కావాలి

అల్ట్రా మారథాన్ ప్రారంభంలో ఎస్పీ అన్బురాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 21: వ్యాయామం ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో సామాజిక సేవతోపాటు శారీరక శ్రమ ఎంతో ముఖ్యమన్నారు. ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అల్ట్రా మారథాన్‌ను ఆదివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఎస్పీ అన్బురాజన్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. పూలే సర్కిల్, సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు, టవర్‌క్లాక్, కోర్టురోడ్డు, హౌసింగ్‌బోర్డు మీదుగా అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియం వరకు 10కే రన్, 5కే వాక్ సాగింది. ఆర్డీటీ స్టేడియంలో కమ్యూనిటీ రన్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజికసేవకు పునరంకితం కావాలని, అప్పుడే జీవితానికి సార్థకత లభిస్తుందని వివరించారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఆర్డీటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, అల్ట్రా రన్నర్ జువాన్ మాన్యువల్ పాల్గొన్నారు.



రన్‌లో పాల్గొన్న వారు

మోకాళ్లపై నడుస్తూ నిరసన



నిరసన తెలుపుతున్న పట్టు రైతులు, రీలర్లు

హిందూపురం అర్బన్ జనవరి 21: రాష్ట్రవ్యాప్తసమ్మెలో భాగంగా ఆదివారం 5వరోజు హిందూపురంలోని పట్టుగూళ్ల మార్కెట్ ఎదురుగా పట్టురైతులు, రీలర్లు మోకాళ్లపై నడిచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా అధికారులను, రాయలసీమ వైసీపీ కో ఆర్డినేటర్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, అప్పటి హిందూపురం వైసీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను, ప్రభుత్వ సలహాదారు సజ్జలరామకృష్ణారెడ్డిని, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను పలుమార్లు కలిసి న్యాయం చేయాలని కోరామన్నారు. అయినా స్పందనలేదన్నారు. సీఎంను కలిసి తమగోడును చెబుదామని సజ్జలను అడిగితే కుదరదని పంపేశారన్నారు. రైతు పార్టీ అని గొప్పలు చెప్పడం కాదని, వారి కష్టాలు, నష్టాలను తెలుసుకుని న్యాయం చేయాలన్నారు. ముఖ్యమంత్రి మాత్రం ప్యాలెస్ వదిలి రావడం లేదని విమర్శించారు. వెంటనే పట్టు రైతులకు అందాల్సిన ప్రోత్సాహకం అందించకపోతే రైతుల ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టు రైతు రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం వెంకటరామిరెడ్డి, జిల్లా కార్యదర్శి సిద్దారెడ్డి, రాజేష్, నవీన్, రీలర్లు ముస్తాఫ, ఖలీల్, అన్సర్ ఉన్నారు.

ఓట్లు మావి.. సీట్లు ఇతర ప్రాంతాల వారికా?

రాజకీయ పార్టీలకు పలు సంఘాల నాయకుల ప్రశ్న



మాట్లాడుతున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 21: ఇతర జిల్లాలు, రాష్ట్రాల వారికి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి నిలబెట్టి ఇక్కడి ప్రజలతో ఓట్లు వేయించుకుంటున్నారు.. అంటే ఓట్లు మావి.. సీట్లు ఇతర ప్రాంతాల వారికా..? అని పలు సంఘాల నాయకులు రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. ఆదివారం ఉపాధ్యాయ భవన్‌లో 'రాజకీయ పార్టీల దిగుమతి విషసంస్కృతి' అనే అంశంపై ఆర్ఈఎఫ్, బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంఘం, మాదిగ దండోరా, ఇతర సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, బీసీ/ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టా శ్రీధర్, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధికార ప్రతినిధి అక్కులప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధికి బడుగు, బలహీన, వెనుబడిన వర్గాలు కీలకంగా వ్యవహరిస్తున్నా రాజకీయంగా అన్యాయం జరుగుతోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు న్యాయంచేస్తాం.. ఓట్లు వేయాలంటూ పార్టీలు మభ్యపెడుతున్నాయన్నారు. కులాలవారిగా టికెట్లను ఇవ్వాలనుకుంటే లోకల్ వారికే ఇవ్వాలన్నారు. ఇతర ప్రాంతాల వారికి ఇచ్చే విషసంస్కృతిని ఖండిస్తున్నామని తెలిపారు.

సాంబశివారెడ్డి ఇంట్లో మనిషికి ఎమ్మెల్యే టిక్కెట్టా..?

వైసీపీ నాయకుడు సాంబశివారెడ్డి ఇంట్లో పనిచేసే వీరాంజనేయులుకు శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలబెడుతున్నారని, అలాంటి వ్యక్తికి చట్టసభల్లో ప్రశ్నించే హక్కు ఉంటుందా అని ప్రశ్నించారు. సాంబశివారెడ్డి రాసిచ్చిన పేపర్‌ను చదివేవాడికి టిక్కెట్ ఇవ్వడం రాజకీయ క్రీడకు నిదర్శనమన్నారు. ప్రజల కోసం పనిచేసేవారికి కాకుండా పార్టీ విధానాలను అమలు చేసే వారికి టికెట్లు కేటాయిస్తున్నారన్నారు. పూలే, అంబేడ్కర్ ఆశయాలతో సమాజం కోసం పనిచేస్తున్న వారికి రాజకీయాల్లో అవకాశం కల్పించి ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్మారు నాగరాజు, రామకృష్ణ, గోవిందు, మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకంతో నగదు మళ్లింపు

ఆర్అండ్‌బీలో ఓ సూపరింటెండెంట్ నిర్వాకం

అనంతపురం క్రైం, జనవరి 21: ప్రభుత్వ సొమ్మును ఓ ఉద్యోగి సొంత ఖాతాకు మళ్లించుకున్నాడు. ఆర్అండ్‌బీలో ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తన ఖాతాకు సూపరింటెండెంట్ డబ్బును జమచేసుకున్నాడు. ఈ మేరకు టూటౌన్‌లో కేసు నమోదైంది. సీఐ శివరాముడు వివరాలు తెలిపారు. ఆర్అండ్‌బీలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగరాజు ప్రభుత్వ అకౌంట్‌కు సంబంధించి ఆ శాఖకు చెందిన ఓ చెక్‌పై ఈఈ ప్రసాద్‌రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ.7,67,744లు తన అకౌంట్‌కు మళ్లించాడు. విషయం తెలుసుకున్న ఈఈ ప్రసాద్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. కాగా విషయం బయటకు పొక్కడంతో ఆ డబ్బును తిరిగి ప్రభుత్వ ఖాతాకు సూపరింటెండెంట్ మళ్లించినట్లు సమాచారం.

చికిత్స పొందుతూ రైతు మృతి

కదిరిఅర్బన్, జనవరి 21: ఆత్మహత్యకు యత్నించిన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఘటనపై రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరి మండలం కాళసముద్రం గ్రామానికి చెందిన జయప్ప (66) ఈనెల 19వతేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అ క్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. జయప్ప తనకున్న ఆరెకరాల పొలంలో మూడు బోర్లు వేసి వేరుశనగ, టమోటా సాగు చేశాడు. పంటల పెట్టుబడి, బోర్లు వేయడానికి రూ.5లక్షల వరకు అప్పుచేశాడు. పంటల దిగుబడి సరిగా లేకపోవడంతో అప్పు తీర్చే మార్గం కనిపించక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుమారుడు తిరుపతయ్య ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టైర్ల షాపులో భారీ అగ్నిప్రమాదం







అగ్నికి ఆహుతైన టైర్లు, ఎగసిపడుతున్న మంటలు, అదుపు చేసేందుకు శ్రమిస్తున్న ఫైర్ సిబ్బంది

- మంటలను అదుపుచేయడానికి శ్రమించిన ఫైర్ సిబ్బంది
- తెల్లవారుజామున కావడంతో తప్పిన ప్రాణనష్టం
- నష్టం అంచనా వేయడానికి సమయం పడుతుంది: ఫైర్ సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, జనవరి 21: జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ మార్గ్‌లోని 80 అడుగుల రోడ్డులో ఉన్న టైర్ల షాపులో ఆదివారం ఉదయం 4 గంటల సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అందుబాటులో ఉన్న రెండు ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే భారీఎత్తున మంటలు ఎగసిపడుతుంటంతో డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, ఏడీఎఫ్ఓ లింగమయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తాడిపత్రి, ధర్మవరం నుంచి రెండు ఫైర్‌ఇంజన్లను హుటాహుటినా తెప్పించారు. నాలుగు ఫైర్ ఇంజన్లు ఉన్నా ఎగిసిపడుతున్న మంటలను అదుపుచేయడం సిబ్బందికి సవాల్‌గా మారింది. డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సిబ్బంది అక్కడికి చేరుకుని ఫైర్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎట్టకేలకు మంటలను అదుపుచేశారు. ఈ సంఘటనతో స్థానికులు ఆందోళన చెందారు. నివాస గృహాలకు మంటలు వ్యాపిస్తాయేమోనని భయపడ్డారు. కాగా రూ. 60 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లివుంటుందని స్థానికులు చెబుతుండగా పూర్తిస్థాయిలో అంచనా వేయడానికి సమయం పడుతుందని ఫైర్‌సిబ్బంది పేర్కొన్నారు. అధికారుల బృందం పరిశీలించి అంచనా వేయడం జరుగుతుందన్నారు. కాగా ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా..? ఆకతాయిల పనా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకోవడానికి అవకాశం చాలా తక్కువని, ప్రధానమార్గం కావడంతో ఆకతాయిల పనే అయి ఉంటుందని యంత్రాంగం అంటోంది. కావాలనే చేశారా..? ప్రమాదవశాత్తు జరిగిందా..? అన్నది విచారణలో తేలాల్సివుంది.

రేపు ఉరవకొండలో సీఎం జగన్ పర్యటన

అనంతపురం జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం జిల్లా పర్యటనకు రానున్నారు. ఉదయం 8.30 గంటలకు తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయలుదేరి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. 10 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు ఉరవకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. 10.40 గంటల వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం అక్కడి నుంచి వాహనంలో సభావేదికకు చేరుకుంటారు. 10.55 గంటల నుంచి మధ్యాహ్నం 12.35 గంటల వరకు వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత లబ్ధి మంజూరులో భాగంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడతారు. అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకొని స్థానిక నాయకులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 1.50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.20 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 3.15 గంటలకు గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 3.40 గంటలకు తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుకుంటారు.

బంగారు నగలు, నగదు చోరీ

పెనుకొండ టౌన్, జనవరి 21: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో శనివారం ఉదయం మహిళ బ్యాగులో ఉంచిన పర్సులోని బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లారు. పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన ఆశ వారం క్రితం కర్ణాటకలోని పావగడకు వెళ్లింది. శనివారం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైంది. మధ్యాహ్నం పెనుకొండలో బస్సు దిగి రెండు బ్యాగులను తీసుకుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట డ్రైనేజీ కాలువపై పెట్టింది. ఆమె ఇద్దరు కుమారులు తినుబండారాల కోసం పరిసర ప్రాంతంలోని దుకాణానికి వెళ్లారు. వారు రావడం ఆలస్యం కావడంతో ఆమె దుకాణం వద్దకు వెళ్లి వారిని పిలుచుకుని వచ్చింది. ఈ సమయంలో బ్యాగులోని పర్సులో ఉన్న 15 గ్రాముల బంగారం నగలు, రూ.5వేలు నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లినట్లు గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీలో అసమ్మతి సెగలు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

వైసీపీలో అసమ్మతి సెగలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. నూతన ఇన్‌చార్జిల నియామకం జరిగిన తరువాత పార్టీలో అసమ్మతి ఎక్కువవుతూ వస్తోంది. తాజాగా మోపురుగుండు చంద్రశేఖర్ గుడిబండలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి వైసీపీ సమన్వయకర్త ఈరలక్కప్పపై పలు ఆరోపణలు చేశారు. ధర్మవరంలోని వైసీపీ 27వ వార్డు ఇన్‌చార్జి డోలా రాజారెడ్డి.. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తీరు నచ్చక పార్టీ వీడనున్నట్లు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ అసమ్మతి సెగలు మరింత ఎక్కువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

మడకశిర, జనవరి 21: గత స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిన ఈరలక్కప్పను వైసీపీ సమన్వయకర్తగా ఏవిధంగా నియమిస్తారని గుడిబండ సింగిల్‌విండో అధ్యక్షుడు మోపురుగుండు చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గుడిబండ పోలీస్‌స్టేషన్‌లో అతడిపై కేసులు నమోదయ్యాయన్నారు. అప్పట్లో పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలకు పాల్పడి పార్టీ సస్పెన్షన్‌కు గురయ్యారన్నారు. అటువంటి వ్యక్తిని ఏవిధంగా సమన్వయ కర్తగా నియమిస్తారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డిపై తిరుగుబాటు

వైసీపీకి గుడ్‌బై చెప్పే యోచనలో డోలా రాజారెడ్డి



డోలా రాజారెడ్డి

ధర్మవరం: ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిపై సొంతపార్టీలో తిరుగబాటు మొదలైందా? ఆయన వ్యవహార శైలిపై చాలా మంది నేతలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారా? సరైన సమయం చూసి చాలా మంది పార్టీకి గుడ్‌బై చెప్పే యోచనలో ఉన్నారా..? అన్న ప్రశ్నలకు ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే అవును అనే సమాధానం వినిపిస్తోంది. నియోజకవర్గంలో నేనే మోనార్క్ అనేలా ఎమ్మెల్యే వ్యవహార శైలి ఉండటం వల్ల చాలా మంది సీనియర్ నాయకుల సైతం నాలుగున్నేళ్లగా బయటకు చెప్పుకోలేక లోలోపల మథనపడుతూ ఇంత కాలం నెట్టుకొచ్చారనే అభిప్రాయం వినిపిస్తోంది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఇదే సరైన సమయం అని ఎమ్మెల్యేకు తగిన గుణపాఠం చెప్పాలనే యోచనలో పలువురు నాయకులు ఉన్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే ప్రస్తుతం ధర్మవరం 27వ వార్డు వైసీపీ ఇన్‌చార్జ్ డోలా రాజారెడ్డి పార్టీని వీడతారనే ప్రచారం ధర్మవరంలో సాగుతోంది. ఎమ్మెల్యేతో డోలారాజరెడ్డికి చాలా కాలంగా విభేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీలో తాను వార్డు ఇన్‌చార్జ్‌గా ఉండటంతోపాటు తనభార్య డోలా ఓబుళమ్మ కౌన్సిలర్‌గా ఉన్నప్పటికీ పార్టీలో సరైన ప్రాధాన్యత లేకపోవడం వల్ల వారి మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో వార్డు ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి రాజారెడ్డిని తప్పించి జడ్పీవైస్‌చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డికి అప్పగించినట్టు తెలిసింది. దీంతో ఇక వైసీపీలో కొనసాగడం ఏ మాత్రం మంచిదికాదన్న అభిప్రాయంలో డోలా ఉన్నట్టు సమాచారం. డోలా రాజారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డిని ఇటీవల కలవడం ధర్మవరంలో చర్చనీయాంశంగా మారింది. తన సహచరులు, పార్టీ శ్రేణులతో చర్చించిన తరువాత వైసీపీని వీడతారనే ప్రచారం సాగుతోంది. డోలా బాటలో మరికొందరు నేతలు ఉన్నట్టు సమాచారం. ఇప్పటికే కొందరు చేనేత వర్గీయులు ఎమ్మెల్యేతీరు నచ్చక తీవ్ర అసంతృప్తితో అంతర్గతంగా ప్రధానప్రతిపక్ష పార్టీ నాయకులను ఆశ్రయించినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉన్న చేనేత వర్గానికి చెందిన చందారాఘవ ఇటీవల తన వార్డులో పర్యటించిన ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను స్వయంగా ఇంటికి ఆహ్వానించిన సంఘటన ఎమ్మెల్యేపై అసమ్మతిని తెలియజేస్తోంది. ఇంకా మరికొందరు చేనేత వర్గీయులు లోలోపల ప్రతిపక్షపార్టీలనాయకులకు టచ్‌లో ఉన్నట్టు సమాచారం. ఎన్నికల సమీపిస్తున్న వేళ ఎమ్మెల్యేపై ఉన్న అసమ్మతి రాగం రోజురోజుకు మరింత బహిర్గతమవుతుందన్న వాదన ధర్మవరంలో వినిపిస్తోంది.

బీజేపీకి వజ్ర భాస్కర్‌రెడ్డి రాజీనామా



కదిరి, జనవరి 21: బీజేపీకి శ్రీసత్యసాయి జిల్లా మాజీ అధ్యక్షుడు వజ్ర భాస్కర్‌రెడ్డి రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం తెలిపారు. అనివార్య కారణాలు, పార్టీలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. రాజీనామా లేఖను రాష్ట్ర అధ్యక్షుడికి పంపినట్లు వివరించారు.

ఏబీఎన్ విలేకరికి పురస్కారం



కదిరి, జనవరి 21: ఏబీఎన్ కదిరి విలేకరి నరసింహులుకు గిడుగు రామ్మూర్తి జీవన సాఫల్య జాతీయ అవార్డు దక్కింది. ఈ అవార్డును సోమవారం సాయంత్రం హైదబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన అందుకోనున్నారు. తెలుగు వ్యావహారిక భాషోద్యమంలో పాలుపంచుకున్నందుకు అవార్డు లభించినట్లు నరసింహులు తెలిపారు. పాత్రికేయుడిగా చివరి వరకు కొనసాగడమే తన లక్ష్యమన్నారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి

లేకుంటే దశల వారీ ఉద్యమం

రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య

అనంతపురం విద్య, జనవరి 21: ఆశా వర్కర్లకు కనీస వేతనంగా రూ. 26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆశా వర్కర్ల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో 50 వేల మంది వర్కర్లు పనిచేస్తున్నారని, వారి సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా ఉద్యమాన్ని చేస్తామన్నారు. కేంద్రం ఇచ్చే రూ. 3500లతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం వేతనం పెంచినట్టు చెప్పడం సరికాదన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి నిలిపివేయడం దుర్మార్గమన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో పనిచేశారన్నారు. కొందరు మరణిస్తే వారికి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పి ఇంతవరకు 50పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా డిమాండ్లు నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగవేణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఇతర నాయకులు కృష్ణుడు, ఫాతిమా, చిట్టి, సుగుణ, దుర్గమ్మ, అనంత లక్ష్మి, హసీనా, అనీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య



యువగళం వలంటీర్లను సన్మానిస్తున్న కాలవ శ్రీనివాసులు

యువగళం వలంటీర్లకు సన్మానం

అనంతపురం అర్బన్, జనవరి 21: నారాలోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో వలంటీర్లుగా పనిచేసిన వారిని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. ఆదివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో అనంత ఉమ్మడి జిల్లాకు చెందిన యువగళం వలంటీర్లకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో గుడుపూటి నారాయణస్వామి, వెంకటప్ప, విక్రమ్‌రెడ్డి, సునీల్, యశ్వంత్, హేమంత్, లోకేష్, రాకేష్, జయసింహ, ఉపేంద్ర పాల్గొన్నారు.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు న్యాయం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 21 : టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి నాయకులు పేర్కొన్నారు. బీసీ బాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక కమలానగర్‌లోని పలు షెలూన్ షాపుల వద్దకు అనంతపురం అర్బన్ టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి నాయకులు కడియాల కొండన్న, తాడిమర్రి సురేంద్రలు వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై వివరించడంతోపాటు కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి, చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు.

8న ఆశాకార్యకర్తల 'చలో విజయవాడ'

అనంతపురం టౌన్ జనవరి 21 : ఆశాకార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 8న చలో విజయవాడ చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగమణి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గణేనాయక్ కార్యాలయంలోఏపీ ఆశావర్కర్ల జిల్లా కమిటీ సమావేశంలో చలో విజయవాడ పోస్టర్లను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ.. చలో విజయవాడకు పెద్దఎత్తున ఆశాకార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తల సంఘం నాయకులు మాలతి, భారతి, పద్మావతి, మీనాక్షి, గాయత్రి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

రేపు డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలు

అనంతపురం సెంట్రల్, జనవరి 21: ప్రధాని మోదీ పరీక్షాపే చర్చాలో భాగంగా మంగళవారం డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్కేయూ క్యాంపస్ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ కరీమ్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎగ్జామ్ వారియర్, స్వాతంత్ర్య సమరయోధుల బుక్స్‌తోపాటు సర్టిఫికెట్స్ బహూకరిస్తారన్నారు. తమ పాఠశాలలో నిర్వహించే పోటీలకు ఉమ్మడి జిల్లాలోని అన్ని పాఠశాలల 8, 9వ తరగతి విద్యార్థులందరూ అర్హులని, ఆసక్తిగల వారు హాజరుకావాలని కోరారు.

అనంతలో ఉద్యోగమేళా

అనంతపురం సెంట్రల్: నిరుద్యోగ యువతీ, యువకులకు మంగళవారం ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ సంస్థలు ముత్తూట్ ఫైనాన్స్, బిల్డర్స్ అండ్ డెవలపర్స్, కార్పొరేట్ సర్వీస్ కంపెనీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేసేందుకు మేళాను నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి నుంచి ఎంబీఏ, ఎంకామ్ వరకు విద్యనభ్యసించిన వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.12వేల నుంచి రూ.18వేల వరకు జీతం చెల్లిస్తారని తెలిపారు. ఆసక్తిగలవారు కోర్టు రోడ్డులోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే మేళాకు వారి బయోడేటాతో హాజరు కావాలన్నారు.

క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిల సమావేశం

అనంతపురం అర్బన్ : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిల సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు ఒకటో క్లస్టర్ నుంచి ఆరో క్లస్టర్ వరకు, ఉదయం 10 గంటల నుంచి ఏడో క్లస్టర్ నుంచి 12వ క్లస్టర్ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు. సమావేశానికి క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు తప్పని సరిగా హాజరుకావాలన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 21: స్థానిక ఎన్‌టీఆర్ మార్గ్ రోడ్డులోని గుజిరి షాప్‌లో ఆదివారం తెల్లవారుజామున జరిగిన భారీ అగ్నిప్రమాదంలో దాదాపు రూ.80 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, బాధితురాలు లలిత కుటుంబాన్ని ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని జనసేన నగర అధ్యక్షుడు బాబూరావు ప్రభుత్వాన్ని కోరారు. సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట నాయకులు విజయకుమార్, రాజు ఉన్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 21: కళ్యాణదుర్గం మండలం మానిరేవుకు చెందిన బ్రహ్మానందరెడ్డి కుమారుడు రేవంత్‌రెడ్డి నగరంలో ఏజీఎస్‌లో పదోతరగతి చదువుతూ హాస్టల్లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన రేవంత్‌రెడ్డికడ.. తిరిగి హాస్టల్‌కు రాలేదు. దీనిపై నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

భర్తపై కేసు : ధర్మవరం పట్టణం వెంకటలక్ష్మి కుమార్తె వరలక్ష్మి, కోవూరునగర్‌కు చెందిన విజయ్‌కుమార్‌కు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. గత కొంతకాలంగా తనను మానసికంగా వేధిస్తున్నాడని వరలక్ష్మి ఆదివారం నాలుగో పట్టణపోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశారు.

ప్రకటనలకే పరిమితమైన దిశ చట్టం

అనంతపురం సెంట్రల్, జనవరి 21: మహిళలపై దాడులు, అత్యాచారాలు, వరకట్న వేధింపులు అరికట్టడంలో భాగంగా రూపొందించిన దిశ చట్టాన్ని సీఎం జగన్‌రెడ్డి కేవలం ప్రకటనలకే పరిమితం చేశారని వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) మహిళా అధ్యక్షురాలు స్వతంత్రకుమారి మండిపడ్డారు. దేశవ్యాప్తంగా మహిళలు అణచివేతకు గురి అవుతున్నారని, దీనిపై చర్చించేందుకు జిల్లా కేంద్రంలో గురువారం మహిళా సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆమె మాట్లాడారు. ప్రతి మహిళా ఉద్యమకారిణిగా అవతరించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేకలకుంట రామాంజినేయులు పాల్గొన్నారు.

కొనసాగిన చిరుధాన్యాల పండుగ

అనంతపురం క్లాక్‌టవర్ : స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అనంత చిరుధాన్యాల పండుగ-2024 ప్రదర్శన రెండో రోజైన ఆదివారమూ కొనసాగింది. ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త చంద్రమోహన్ రెడ్డి, ప్రముఖ జర్నలిస్టు కూర్మనాథ్, పీజీఎస్ చంద్రకళ చిరుధాన్యాల ప్రాధాన్యతపై వివరించారు.

పంట నష్టపరిహారం, బీమా వెంటనే ప్రకటించాలి

శింగనమల, జనవరి 21: జిల్లా వ్యాప్తంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం, బీమా మంజూరు చేయాలని జిల్లా సీపీఐ కౌన్సిల్ మెంబర్ డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సలకంచెరువు గ్రామంలో గ్రామకమిటీ సమావేశం నిర్వహించి... నూతన గ్రామ కమిటీని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ రబీలో రైతులు పంటలు సక్రమంగా రాకపోవడంతో పంటలు పూర్తి స్థాయిలో నష్టపోవడంతో అప్పు ఊబిలో కూరుకుపోయారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఓబుల బయన్న, కోనన్న, గంగాధర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్నప్పయాదవ్

వైసీపీలో నుంచి టీడీపీలోకి చేరిక

అనంతపురంరూరల్, జనవరి 21: మండలంలోని ఇటుకలపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. ఆదివారం మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ఆమె సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సాకే పోతలయ్య, సాకే పవన్‌కుమార్, పెద్దన్న, పవన్ కుమార్, నాగేంద్రజ అంజి, సుంకన్న తదితరులు వారి కుటుంబాలతో పార్టీలోకి చేరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, మాజీ ఎంపీటీసీ అక్కులప్ప, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాగే మురళీ మోహన్, మాధవరాజు, మారుతి, రాజశేఖర్, చిన్న రాజు, శ్రీరాములు వెంకటరాముడు, నాగేంద్ర, రాము, క్రిష్ణ పెద్దన్న, అనిల్ పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో మాజీ మంత్రి పరిటాల సునీత

బాధిత కుటుంబాలకు పరామర్శ

మండలంలోని చియ్యేడు గ్రామానికి తెలుగు మహిళ నాయకురాలు రమణమ్మ కుమారుడు బోయరవి ఇటీవల మరణించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం బాధిత కుటుంబాన్ని పరిటాల సునీత పరామర్శించారు. అదే విధంగా బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కమతం పోలేరయ్య కుటుంబాన్నీ ఆమె పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చియ్యేడు లక్ష్మీనారాయణ, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యదర్శుల నియామకం

రాప్తాడు : రాప్తాడు నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా రాప్తాడుకు చెందిన సాకే రమేష్‌ను, మండల ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా రాప్తాడుకు చెందిన చర్మాల రామును నియమించినట్లు మాజీ మంత్రి పరిటాల సునీత తెలిపారు. నూతనంగా ఎంపికైన కార్యనిర్వాహక కార్యదర్శులు ఆదివారం అనంతపురంలో మాజీ మంత్రి పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, నాయకులు గంగలకుంట రమణ, కిష్టా పాల్గొన్నారు.

మృతుడికి నివాళి

ఆత్మకూరు : మండలంలోని తోపుదుర్తి గ్రామంలో సీనియర్ టీడీపీ నాయకుడు తోపుదుర్తి గోపాల్ (65) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మాజీ మంత్రి పరిటాల సునీత సందర్శించి నివాళలర్పించారు. ఆమె వెంట జిల్లా టీడీపీ నాయకులు ఎల్ నారాయణ చౌదరి, నెట్టం వెంకటేసులు, మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, మాజీ కన్వీనర్ క్రిష్ణమోహన్ చౌదరి, నాయకులు పరిటాల శ్రీనివాసులు, అనీల్ చౌదరి, సూరి ఉన్నారు.

కృతజ్ఞతలు..

చెన్నేకొత్తపలి : రాప్తాడు నియోజకవర్గ టీడీపీ విభాగపు వాల్మీకి ఫెడరేషన్ కార్యదర్శిగా ఇటీవల నియమించిన చీమల అనిల్‌కుమార్ ఆదివారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ముత్యాలప్ప, పణి మోహన్, నరసింహులు, అరవింద్ పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : తెలుగుదేశం పార్టీ అనుబంధం రాప్తాడు నియోజకవర్గం వాల్మీకి బోయ సాధికార ఫెడరేషన్ కమిటీ సభ్యులు మాజీ మంత్రి పరిటాల సునీతను కలిశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఓబులేసు, ఉపాధ్యక్షుడు సాకే బ్రహ్మ, కమిటీ సభ్యులు చిన్న రాజు, నాగరాజు, శివకుమార్, ఓబులేసు నాయకులు అనిల్, నారాయణస్వామి, జయరాములు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా భూమి ఆక్రమిస్తున్నారు

చెన్నేకొత్తపల్లి : తమ భూమిని స్థానిక వైసీపీ నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారని ఓ రైతు కుటుంబ సభ్యులు మాజీ మంత్రి పరిటాల సునీత వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని బసినేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, రైతు హరిబాబు, తన కుటుంబసభ్యులతో ఆదివారం అనంతపురంలోని పరిటాల సునీత క్యాంప్ కార్యాలయంలో ఆమెను కలిసి తనకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. 2008లో గ్రామ సమీపంలో 243-బీ సర్వే నెంబరులో నాలుగు ఎకరాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తమను ఆ భూమిలోకి వెళ్లనీవ్వకుండా కొందరు ఆ పార్టీ వర్గీయులు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో హైకోర్టును ఆశ్రయించడంతో స్టే కూడా వచ్చిందన్నారు. అయినా కోర్టు ఉత్తర్వులను లెక్కచేయకుండా దౌర్జన్యంగా భూమిలోకి వచ్చి చదును చేయిస్తున్నారని వాపోయారు. అంతటితో ఆగకుండా భూమిని అమ్ముకుని సొమ్ము చేసుకోవాలని చూస్తున్నారని, తనకు న్యాయం చేయాలని అధికారుల వద్ద మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. పరిటాల సునీత స్పందిస్తూ భయపడరాదని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మండలంలో వైసీపీ నాయకుల భూ దౌర్జన్యాలు మితిమీరిపోయాయని, అలాంటి వారందరు తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే బాధితులకు న్యాయం దక్కేలా చేస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

12వ పీఆర్సీని సత్వరమే అమలు చేయాలి

రాప్తాడు, జనవరి 21: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ జూలై 2023 నుంచి అమలు చేయాల్సి ఉన్నా ఇంతవరకూ పట్టించుకోలేదని, వెంటనే పీఆర్సీ అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం రాప్తాడు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఏపీటీఎఫ్ అనంతపురం సబ్ కమిటీ సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్సీలో బకాయిపడ్డ అన్ని ఆర్థిక సౌలభ్యాలను సత్వరమే చెల్లించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఉపాధ్యాయుల సమస్యల పట్ల ఏ మాత్రం స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఈనెల 31న కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున ధర్నా చేపడతామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఏపీటీఎఫ్ నాయకులు హనుమప్ప, వెంకటేష్, బొమ్మయ్య, సతీష్‌కుమార్, రామాంజినేయులు, రాందాస్‌రెడ్డి, చెన్నకేశవ, ఈరప్ప, రామ్మోహన్, అంజలీదేవి పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుల దౌర్జన్యం

మాన్యం భూమిలో చెట్ల తొలగింపు

ధర్మవరంరూరల్, జనవరి 21: కనగానపల్లి మండలం తూంచెర్ల గ్రామంలో అధికారపార్టీ నాయకుల దౌర్జన్యంతో మాన్యం భూమిలో ఏళ్లతరబడి ఉన్న చింతచెట్లు, వేపచెట్లను జేసీబీతో తొలగించారు. గ్రామంలో సర్వేనెంబర్ 255లో శ్రీవెంకటేశ్వరస్వామి మాన్యం భూమి సుమారు రెండు ఎకరాలు ఉంది. ఆ భూమిలో చింతచెట్లు, వేపచెట్లు ఉన్నాయన్నారు. ఆ భూమికి సమీపాన ఉన్న అధికార పార్టీకి చెందిన కొందరు మాన్యం భూమిలో సాగుచేసుకునేందుకు జేసీబీతో 10 చింత చెట్లు, 7 వేపచెట్లును ఇటీవల తొలగించారు. అధికారపార్టీ అండతో ఇష్టానుసారంగా చెట్లును తొలగించడంపై ఆ గ్రామస్థులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మూర్ఛవ్యాధి బాధితులు జాగ్రత్తలు పాటించాలి

అనంతపురం కల్చరల్, జనవరి 21: మూర్ఛవ్యాధి బాధితులు మందులు వాడడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలని న్యూరాలజిస్టు డాక్టర్ గోపాలం శివన్నారాయణ సూచించారు. జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని జేవీవీ కార్యాలయంలో మూర్ఛవ్యాధి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ గోపాలం శివన్నారాయణ మాట్లాడుతూ.. బాధితులు ఈదడం, డ్రైవింగ్ చేయడం వంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. శిబిరంలో పాల్గొన్న దాదాపు 120 మంది బాధితులకు 2 నెలలకు సరిపడా మందులను జేవీవీ కన్వీనర్ రామకృష్ణ అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ నగర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ ప్రసూన, డాక్టర్ హరికిశోర్, నగరాధ్యక్షుడు రామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎర్రిస్వామి, నూర్ మహమ్మద్, వన్నూర్, శివ, చరణ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

సర్వే వేగవంతంగా చేపట్టండి

అనంతపురంరూరల్, జనవరి 21: కులగణన సర్వే వేగవంతంగా నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కురుగుంట, ఎ.నారాయణపురం పంచాయతీల్లో జరుగుతున్న కులగణన సర్వేను ఎంపీడీఓ పుల్లయ్యతో కలసి ఆయన పరిశీలించారు. మండలంలో 49,927 గృహాలున్నాయని, గ్రామ వార్డు యాప్ నందు ప్రతి గృహంలో నివసిస్తున్న వారి కులం, ఉపకులం వివరాలు నమోదు చేయాలని కోరారు. సర్వేలో సచివాలయ ఉద్యోగులు, వలంటరీలు తప్పని సరిగా పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటరీలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పోలీసుల నోటీసులు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: విజయవాడలో మంగళవారం అంగన్‌వాడీలు చేపట్టబోయే నిరహార దీక్షకు వెళ్లకుండా జిల్లాలోని అంగన్‌వాడీలకు పోలీసులు ఆదివారం నోటీసులు అందజేశారు. గార్లదిన్నె తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళనను కొనసాగించారు. విజయవాడకు వెళ్లరాదని పోలీసులు అంగన్‌వాడీల ప్రాజెక్టు కోశాధికారి లీలావతికి నోటీసులు అందచేశారు. అలాగే శింగనమల సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు విజయవాడ వెళ్లకుండా పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. నార్పలలో అంగన్‌వాడీలు తమ ఆందోళనను కొనసాగించారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

శింగనమల జనవరి 21: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు మండలంలో నాలుగురు విద్యార్థులు అర్హత సాధించారు. 2023 ఆగస్టు 12న జరిగిన ఎన్‌ఎంఎంఎం అర్హత పరీక్షను నిర్వహించారు. శింగనమల మండలం నుంచి నాలుగురు విద్యార్థులు అర్హత సాధించారు. శింగనమల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సింధుజరెడి, డి.నీహరిక. బి.సాయిశ్రీ, సలకం చెరువు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి పి.బాధుస్వతి కేంద్రం నుంచి వచ్చే మెరిట్ స్కాలర్‌షిప్ ఏడాదికి రూ.12,000 పొందారు. ఈస్కాలర్‌షిప్ 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చెల్లిస్తారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

శింగనమల, జనవరి 21: స్థానిక ఆత్మాసీతారామదేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అయోధ్య బాలరాముడు ప్రతిష్ట సందర్భంగా ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని దేవాలయంలోనే భక్తులు తిలకరించడానికి పెద్ద టీవీలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతిష్ఠ అనంతరం అన్నదానం కార్యక్రమం ఉంటుందని రామభక్తులు తెలిపారు.

యోగా కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



వీసీని సన్మానిస్తున్న కేంద్ర నిర్వాహకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 21: స్థానిక రెవెన్యూ కాలనీలోని వివేకానంద యోగా కేంద్రాన్ని ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య ఆదివారం పరిశీలించారు. వీసీ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో యోగాసన పోటీలకు విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం హర్షణీయమని కేంద్ర నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో కేంద్ర సభ్యులు హనుమంతురెడ్డి, అంజనేయులు, దివాకర్, దాదులూరయ్య, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.4.09 లక్షలు

అనంతపురంరూరల్, జనవరి 21: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.4,09,230 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2,34,000, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,75,230 ఆదాయం వచ్చిందని తెలిపారు.

మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యమివ్వాలి

అనంతపురం అర్బన్ : రాబోవు ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ముస్లిం మైనార్టీలకు 20 ఎమ్మెల్యే, నాలుగు ఎంపీ స్థానాలు కేటాయించాలని యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు గైబువల్లి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముస్లిం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకోకుండా ఆ వర్గాలకు నాయకులను తయారు చేసే బాధ్యత రాజకీయ పార్టీలు తీసుకోవాలన్నారు.

జిల్లా క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 21: మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఏపీ రాష్ట్ర జట్టు ద్వితీయ స్థానం సాధించిన విషయం తెల్సిందే. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన జిల్లా క్రీడాకారులకు ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. జిల్లా క్రీడాకారులు కృష్ణ, అశోక్, వెంకటేశ్, వెంకట్, విజయ్‌కుమార్, రియాజుద్దీన్, బాబాఫక్రుద్దీన్, సందీప్‌కుమార్, అనీల్‌కుమార్, హరి, విష్ణును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌస్ మొహిద్దీన్, వెంకటేశులు, కోశాధికారి వెంకట నారాయణ పాల్గొన్నారు.

నేడు అమ్మ క్రికెట్ పోటీలు



ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న సైపుల్లా, అమ్మ సంస్థ ప్రతినిధులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 21: అమ్మసంస్థ ఆధ్వర్యంలో సోమవారం అనంత క్రీడాక్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి షెక్షావలి తెలిపారు. కేఎం జకీవుల్లా క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీలను మాజీ ఎంపీ కేఎం సైపుల్లా ఆదివారం తన నివాసంలో ఆవిష్కరించారు. మొత్తం ఆరు టీంలు, సుమారు వందమంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళీ, మణికంఠబాబు, అమ్మసంస్థ సభ్యులు తారా ముస్తాక్, ముక్తియార్, షఫీ, జహంగీర్, మాధవ్, కేశవ పాల్గొన్నారు.

వీరమహిళలను తీర్చిదిద్దడమే లక్ష్యం



కాపు సంక్షేమసేన మహిళా విభాగం జిల్లా నూతన కార్యవర్గం

అనంతపురం కల్చరల్ / క్లాక్‌టవర్, జనవరి 21 : జనసేన పార్టీకి అండగా వీర మహిళలను తీర్చిదిద్దడమే కాపు సంక్షేమ సేన లక్ష్యమని కాపు సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు కాశెట్టి సంజీవరాయుడు పేర్కొన్నారు. ఆదివారం శ్రీనివాసనగర్ బాలాజి కల్యాణమండపం వద్ద నిర్వహించిన కాపు సంక్షేమ సేన జిల్లా సర్వసభ్య సమావేశంలో మహిళా విభాగం నూతన కమిటీని నియామక ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షురాలుగా పేరూరు మహాలక్ష్మి, గౌరవాధ్యక్షురాలుగా అనసూయ, ఉపాధ్యక్షులుగా భాగ్యలక్ష్మి, రామిశెట్టి అంబిక, బొబిలి ఉమ, ప్రధాన కార్యదర్శిగా మధుమిక, కార్యదర్శిగా మధులిక, నగరాధ్యక్షురాలిగా సావిత్రి, ఉపాధ్యక్షురాలిగా జక్కిరెడ్డి పద్మావతి, కార్యదర్శిగా సుమలతను ఎంపిక చేసి వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో కాపు సంక్షేమ సేన రాష్ట్ర నాయకులు పేరూరు శ్రీనివాసులు, ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ గ్రంధి దివాకర్, గౌరవ సలహాదారు వెన్నెల క్రిష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తోట ప్రకాష్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

చెన్నేకొత్తపల్లి, జనవరి 21: కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రుడు మృతిచెందడంతో అతని కుటుంబానికి తమవంతుగా అండగానిలిచారు తోటి స్నేహితులు. మండలంలోని మేడాపురం గ్రామానికి చెందిన తలారి రమేశ్ జనవరి ఒకటిన విద్యుదాఘాతానికి గురై మరణించాడు. అతనికి భార్య రామాంజినమ్మ, కుమార్తె ఉన్నారు. దీంతో అతని కుటుంబం ఇంటి పెద్దదిక్కును కోల్పోయింది. రమేష్ మృతిచెందిన విషయం తెలుసుకున్న మిత్రులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమవంతుగా చేయూతనందించారు. ఆదివారం మిత్రుని కుటుంబాన్ని పరామర్శించి వారు సేకరించిన రూ.60వేలు నగదును రామాంజినమ్మకు అందజేశారు.



సాయం అందజేస్తున్న స్నేహితులు

బాధితుడికి అమ్మ అండ..

అనంతపురం కల్చరల్, జనవరి 21: రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో కిడ్నీ మార్పిడి కోసం వేచిచూస్తున్న బాధితుడికి ఆదివారం అమ్మ సంస్థ చేయూతనందించి. అనంతపురం నగరంలో పాతూరు సున్నపువీధిలో నివసిస్తున్న తిప్పేస్వామి, గొల్లక్కల కుమారుడు రుద్రేష్‌కు జ్వరం కారణంగా రెండు కిడ్నీలు ఫెయిల్ అయి డయాలసిస్‌పై ఆధారపడి జీవిస్తున్నాడు. కిడ్నీ మార్పిడికి రూ.13లక్షలు అవసరమవుతుందని వైద్యులు సూచించడంతో దాతల సహకారంకోసం వేచిచూస్తున్నారు. అమ్మ సోషల్ వెల్ఫేర్ ట్రస్టు వ్యవస్థాపకుడు తరిమెల రమణారెడ్డి బాధిత కుటుంబాన్ని కలిసి రూ.4.5 లక్షలు అందజేశారు.



నగదు అందజేస్తున్న రమణారెడ్డి

సీఎం జగన్.. కోర్టుకు హాజరుకావాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 21: కోడికత్తి కేసులో నిందితుడు జనిపల్లి శ్రీనివాసరావుకు బెయిల్ ఇవ్వాలని, లేకుంటే సీఎం జగన్ కోర్టు విచారణకు వెళ్లి సాక్ష్యమైనా చెప్పాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసనలో రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి మాట్లాడారు. శ్రీనివాసరావుకు బెయిల్ కోసం సీఎం జగన్ కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పాలని శ్రీను తల్లి సావిత్రమ్మ, సోదరుడు సుబ్బరాజు చేస్తున్న నిరసన దీక్షను పోలీసులు భగ్నం చేయడం దుర్మార్గమన్నారు. అదే పోలీసు యంత్రాంగం.. కోడికత్తి కేసులో సాక్ష్యం చెప్పించేందుకు సీఎం జగన్‌ను కోర్టుకు తరలించేలా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. అనేక కేసుల్లో సీఎం జగన్ ఇతర నాయకులు సంవత్సరాలుగా బెయిల్‌పై ఉన్నారన్నారు. అయితే సత్యంబాబు, శ్రీను తదితర దళిత యువకులు నేరం రుజువుకాకనే జైళ్లలో మగ్గుతున్నారని, ఇదేనా భారత రాజ్యాంగాన్ని పరిరక్షించే విధానమని ప్రశ్నించారు. ఇప్పటికైనా శ్రీనుకు న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎరుకుల ప్రజా సంక్షేమ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, బీసీ నాయకులు ఈశ్వరయ్య, ఆర్పీఐ కేపీ రాజు, జేఏసీ నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, ఓబులేసు, శ్రీనివాస్, గోవింద్, మురళి, రఘు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కల్లూరులో పూర్వవిద్యార్థుల సమావేశం

గార్లదిన్నె, జనవరి 21 : మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1991-92 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. నాటి గురువులైన ప్రసాద్ రావు, అశ్వర్థనారాయణ, చెన్నప్ప, రమాదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అల్లెం జాఫర్, మల్లికార్జున, చితంబరరెడ్డి, ఇస్మాయిల్, వసంత, రాజ్యలక్ష్మి, నాగరత్నం, మస్తాన్, రాధా పాల్గొన్నారు.



అభివృద్ధికి కేరాఫ్ టీడీపీ: జేసీపీఆర్


వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న జేసీపీఆర్

పెద్దవడుగూరు, జనవరి 21: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ టీడీపీ అని, మండలంలో అభివృద్ధి పనులు జరగాలంటే పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆయన చేపట్టిన బస్సుయాత్ర ఆదివారం కోనాపురం, రావులుడికి, చింతలచెరువు, తెలికి, మేడిమాకులపల్లి గ్రామాల్లో కొనసాగింది. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో మండలంలో అభివృద్ధి శూన్యమన్నారు. గత ప్రభుత్వంలోనే ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలను అందించామన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. జేసీ వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, హరినాథ్‌రెడ్డి, తిమ్మయ్య, ఆదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి, దస్తగిరి, తిరుపాల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, జయరాంరెడ్డి ఉన్నారు.

సీఎం పర్యటనను అడ్డుకుంటాం


మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత నాయకులు

ఉరవకొండ, జనవరి 21: ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను సీఎం జగన్ మోసగించారని టీఎన్ఎస్ఎఫ్, తెలుగుయువత నాయకులు ప్యారంభరత్, యేళ్లమణి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 23వతేదీ ఉరవకొండలో సీఎం పర్యటనను అడ్డుకుంటామని తెలిపారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ నిరుద్యోగులకు ఏం చేశారో చెప్పాలన్నారు. ప్రత్యేక హోదా, జాబ్ క్యాలెండర్, పోలీస్ కానిస్టేబుళ్ల నోటిఫికేషన్ ఏవీ వదలకుండా నిరుద్యోగులను నట్టేట ముంచారన్నారు. జీవో నెం.117 ను తీసుకువచ్చి గ్రామీణ పాఠశాలలను విలీనం చేసి విద్యార్థులకు విద్యను దూరం చేశారన్నారు. నాయకులు సుధాకర్, షాహిద్, లక్ష్మీనారాయణ, ధనరాజ్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపుదాం

కళ్యాణదుర్గం, జనవరి 21: ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సైకో జగన్‌రెడ్డి, వచ్చే ఎన్నికల్లో ఆ ఒక్క చాన్స్‌తోనే అతనిని ఇంటికి సాగనంపుదామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. ఆదివారం ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఈ నాలుగున్నరేళ్లలో మధ్యతరగతి కుటుంబాలపై ధరల భారం మోపుతూ, వారిని ఆర్థికంగా ఛిన్నాభిన్నం చేశారన్నారు. దాంతో పాటు ఆర్టీసీ చార్జీలు, కరెంటు బిల్లులు, మద్యం ధరలను పెంచేసి సామాన్యుల నడ్డివిరిచిన సైకో జగన్‌రెడ్డిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సామాన్యుడు బతకలేని దీనస్థితికి దిగజారిపోయిందన్నారు. దాంతో పాటు వైసీపీ నేతల దాడులు, దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలు కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నాయని విమర్శించారు.

మినీ వ్యాన్ బోల్తా... డ్రైవర్ మృతి

తాడిపత్రిటౌన్, జనవరి 21: మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం మినీవ్యాన్ బోల్తాపడ్డ సంఘటనలో డ్రైవర్ మహేశ్(20) మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. కోళ్లను అన్‌లోడ్ చేసి తాడిపత్రి నుంచి కొలిమిగుండ్లకు వెళుతున్న మహేశ్ వెంకటరెడ్డిపల్లి సమీపంలోకి రాగానే వ్యాన్ అదుపుతప్పి పల్టీలు కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన మహేశ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిది నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు అనంతరం కేసు నమోదుచేస్తామని రూరల్ పోలీసులు తెలిపారు.

బైక్‌కు నిప్పుపెట్టిన గుర్తుతెలియని దుండగులు

తాడిపత్రి మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో ఆదివారం తెల్లవారుజామున ఓబులేసుకు చెందిన బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అగ్నికి ఆహుతైందని రూరల్ పోలీసులు తెలిపారు. ఓబులేసు లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. డ్యూటీ అనంతరం రోజులాగానే ఇంటిముందు బైక్‌ను ఉంచాడు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పుపెట్టారు. నిద్రలేచిన ఓబులేసు చూసేసరికి బైక్ అగ్నికి ఆహుతైంది. బైక్ పక్కనున్న స్కూటీ, కారుకు మంటలు వ్యాపించేలోపు స్థానికులు ఆర్పేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రూరల్ పరిధిలోని యల్లనూరురోడ్డులో శనివారం రాత్రి కారు-బైక్ ఢీకొన్న సంఘటనలో యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లి గ్రామానికి చెందిన రాంప్రసాద్, తిరుపతమ్మ గాయపడ్డారని రూరల్ పోలీసులు తెలిపారు. వ్యక్తిగత పనినిమిత్తం తాడిపత్రికి ద్విచక్రవాహనంలో వచ్చిన రాంప్రసాద్, తిరుపతమ్మలు పని ముగించుకొని స్వగ్రామానికి వెళుతుండగా యల్లనూరురోడ్డులోని బైపాస్‌రోడ్డు వద్ద వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో వారు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామని పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యాడికి, జనవరి 21: యాడికి సమీప ప్రాంతంలోని మూడు వేర్వేరు ప్రదేశాల్లో పేకాట ఆడుతున్న 14మందిని ఆదివారం అరెస్టుచేసి వారివద్ద నుంచి రూ.23350 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు కోనరోడ్డులోని కంపచెట్ల సమీపంలో ఐదుగురిని అరెస్టు చేసి, రూ.6150, రాఘవేంద్రకాలనీ వెనుక వైపున పాడుబడిన ఇంటి పక్కన పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టుచేసి రూ.6050, చౌడేశ్వరి కల్యాణ మండపం పక్కన పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టుచేసి రూ.11150 స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కూడేరు: మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు చేశారు. ఆదివారం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.68, 470లతో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళకు గాయాలు

పుట్లూరు, జనవరి 21: పుట్లూరు నుంచి తాడిపత్రికి రోడ్డు నిర్మాణం కోసం గత కొన్ని నెలలుగా మట్టిని తరలిస్తున్నారు. టిప్పర్ల రాకపోకల వల్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. దీంతో చాలామంది ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆదివారం పి. చింతలపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరి అనే మహిళ భర్త లక్ష్మీనారాయణరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై తాడిపత్రి నుంచి పుట్లూరు వస్తున్న సమయంలో అధికలోడుతో టిప్పర్ నుంచి రాళ్లు పడడంతో ఆమె గాయపడింది.

టీడీపీ నాయకుడి ఇంట్లో చోరీ

బొమ్మనహాళ్, జనవరి 21: మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకుడు కొత్తపల్లి రామదాసు ఇంట్లో చోరీ జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు కొత్తపల్లి రామదాసు నాలుగు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లడంతో గుర్తు తెలియని దుండగులు ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.3.50 లక్షలు దొంగిలించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్, జనవరి 21: కర్ణాటకలోని బళ్లారి నుంచి అక్రమంగా మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి 624 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన బోయ బసవరాజు, తలారి వన్నూరుస్వామి, ఎరుకుల నాగరాజు అనే ముగ్గురు వ్యక్తులు అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 624 మద్యం ప్యాకెట్లు బయట పడినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ఉరవకొండ, జనవరి 21: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉరవకొండ పర్యటన నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ గౌతమి, ఎస్పీఅన్బురాజన్, జేసీ కేతన్‌గార్గ్ పరిశీలించారు. అనంతపురం-బళ్లారి రహదారిలోని బహిరంగసభ స్థలాన్ని, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అన్ని రకాల ఏర్పాట్లును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జడ్పీ సీఈవో నిదియాదేవి, అడిషనల్ ఎస్పీలు విజయ్‌భాస్కర్‌రెడ్డి, హనుమంతు, ఆర్డీవోలు శ్రీనివాసులు రెడ్డి, రాణి సుశ్మిత, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలి


రాయదుర్గంలో చంద్రబాబును గెలిపించాలని కోరుతున్న కాలవ


గుంతకల్లు: జితేంద్రగౌడ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జనవరి 21: రాష్ట్ర ఉజ్వల భవిష్యత్ కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం పట్టణంలోని 31, 32 వార్డులలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాల మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించాలన్నారు. రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపాలన్నారు. జనసేన ఇన్‌చార్జి మంజునాథగౌడ్, పసుపులేటి రాజు, తిప్పేస్వామి, బండి భారతి, వెంకటేశులు, కావలి రవి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు తథ్యం

గుంతకల్లు: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ గెలుపు తథ్యమని మాజీ శాసనసభ్యుడు ఆర్ జితేంద్ర గౌడ్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పులగుట్టపల్లి గ్రామంలో భవిష్యత్తు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు గ్రామీణులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సింగిల్ విండో సొసైటీ మాజీ అధ్యక్షుడు పాల మల్లికార్జున నేతృత్వంలో పులగుట్టపల్లి, తండాకు చెందిన 30 కుటుంబాలవారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. జితేంద్రగౌడు పార్టీ కండువాలతో వారిని పార్టీలోకి ఆహ్వానించారు. పామన్న, లోకేశ్, పరమేశ్, అశోక్, చిన్నతండా నారాయణ నాయక్, పామన్న, కురుబ వసికేరప్ప, కే మురళి, శేఖర్, బీరప్ప, కే రంజిత్, కే మల్లికార్జున, తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

టీడీపీకి ఓటువేసి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకట శివుడు యాదవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం పట్టణంలోని నాల్గవ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకట శివుడు యాదవ్, పట్టణ కార్యదర్శి బండారు ఆనంద్ ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను వార్డు ప్రజలకు వివరించారు. నాయకులు సంజీవరాయుడు, బొజ్జేనాయక్, కేఎల్ శ్రీనివాసులు, కురువ జగదీశ్, సంగాల రాము, చాంద్ బాషా, సరస్వతి, రామాంజనేయులు, బండారు పులికొండ, సుధాకర్, ఆదినారాయణ, అశోక్, రమణ, ఉడుదల ప్రసాద్ పాల్గొన్నారు.


4వ వార్డు మహిళలకు పథకాలను వివరిస్తున్న వెంకటశివుడు యాదవ్

రాజకీయ చరిత్రలోనే బీసీలకు టీడీపీ పెద్దపీట

● మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్


మాట్లాడుతున్న జితేంద్రగౌడ్

గుత్తి,జనవరి21: రాజకీయ చరిత్రలోనే బీసీలకు పెద్దపీట వేసిన ఘనత టీడీపీదేనని మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ అన్నారు. పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వసుధ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీలు ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బీసీలను వాడుకోవడం తప్పా వారికి చేసిందేమీ లేదన్నారు. సామాజిక సాధికార యాత్ర అంటూ చెబుతున్నారు తప్పా బీసీలకు ఎక్కడా పెద్దపీట వేయలేదని ఆయన ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం చేతకాని దద్దమ్మ ధ్వజమెత్తారు. పోలీసులను అడ్డం పెట్టుకుని పాలన సాగిస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీలకు కనీసం కార్పొరేషన్ సీటు కేటాయించకుండా అవమానించిందన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే కర్తవ్యమన్నారు. ముందుగా గాంధీ సర్కిల్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ బీసీ సెల్ అనంతపురం అర్బన్ అధ్యక్షుడు సిమెంట్ పోలన్న, నాయకులు కేసీ హరి, బీసీ సెల్ కార్యదర్శి పవన్‌కుమార్ గౌడ్, లీగల్ సెల్ కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి, ఆర్ హరినాథ్‌గౌడ్, జనసేన జిల్లా కార్యదర్శి మణికంఠ, ఎస్సీసెల్ కార్యదర్శి దిల్కాశీనా, మైనార్టీ సెల్, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, నియోజకవర్గ నాయకులు ధర్మతేజగౌడ్, అనిల్‌గౌడ్, సంజీవ్‌గౌడ్, విష్ణుతేజగౌడ్, శ్రీకాంత్‌చౌదరి, కేశవనాయుడు, బద్రివలి, రవిశంకర్‌గౌడ్, టైలర్ బాషా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శ్రీనివాసయాదవ్, తలారిమస్తానప్ప, కేశప్ప, సురేంద్ర, లక్ష్మీ, జయమ్మ, అంజలీదేవి, మాధవి, గోవిందు, రంగస్వామి పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యం:
టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గంరూరల్: బీసీల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. ఆదివారం శెట్టూరు మండలం ములకలేడులో ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో జయహో బీసీ సభ నిర్వహించారు. సభకు ప్రజలు ఉప్పెనలా తరలివచ్చారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో బీసీలకు అన్ని విధాల పెద్దపీట వేసిందన్నారు. బీసీల జీవన విధానాన్ని మెరుగుపరచడంలో బీసీ సబ్ ప్లాన్‌లను ఏర్పాటు చేసి ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీల ఓట్లతో గద్దెనెక్కి వారికి మొండిచేయి చూపించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి బీసీల సత్తా ఏంటో ఓట్ల రూపంలో చూపి ఆ పార్టీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ఉమామహేశ్వరనాయుడును గజమాలతో సన్మానిస్తున్న బీసీ నాయకులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

బొమ్మనహాళ్, జనవరి 21: మండలం దర్గాహోన్నూరు ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతునే హోదాలను మరచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగక్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులు నారాయణస్వామి, గుండురావు, రామస్వామి, వన్నారెడ్డి, హుస్సేన్ పీరాలను ఘనంగా సత్కరించి పాదపూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

జనసేన జోన్-2 కమిటీ సభ్యుడిగా సతీష్‌కుమార్

రాయదుర్గం, జనవరి 21: జనసేన పార్టీ రాయలసీమ జోన్-2 సభ్యుడిగా పట్టణానికి చెందిన తడాల సతీష్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లెనిన్ శత వర్ధంతి

గుంతకల్లుటౌన్, జనవరి 21: పట్టణంలోని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో లెనిన్ శత వర్ధంతిని ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ మార్క్స్, లెనిన్ సిద్ధాంతాలను ప్రచారం చేసి ప్రజలను చైతన్యవంతులను చేయడం ద్వారానే లెనిన్‌కు నిజమైన నివాళి అన్నారు. పట్టణ కార్యదర్శి చిన్నా, ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు దేవేంద్ర, రామాంజనేయులు, షేక్షావలి, ఆశాబీ, గోపి, ప్రతాప్, నారాయణ, జానయ్య పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

బొమ్మనహాళ్, జనవరి 21: బొమ్మనహాళ్ మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకుడు కుమ్మరి మల్లికార్జునను పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కాలవ శ్రీ నివాసులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఆపరేషన్ కావడంతో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలపై అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు మండల కన్వీనర్ బలరాంరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, మహేంద్ర, పయ్యావుల నాగరాజు, మాజీ సర్పంచ్ కేశప్ప, గోరంట్ల వెంకటేశులు, కావలి రాము పాల్గొన్నారు.

పామిడి: అనారోగ్యం, శస్త్ర చికిత్సలతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ కార్యకర్తలను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ ఆదివారం పరామర్శించారు. పామిడి పట్టణానికి చెందిన విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ శస్త్ర చికిత్స చేయించుకున్నందుకు, ఎద్దులపల్లి గ్రామానికి చెందిన కార్యకర్త వెంకటరాముడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారిని పరామర్శించారు. కట్టకిందపల్లి గ్రామానికి చెందిన కార్యకర్తలు మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ ఈశ్వరయ్య, దొడ్డి రామాంజనేయులు, రాముగౌడ్‌ను పరామర్శించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


బోల్తా పడిన స్లాగ్ లోడింగ్ లారీ

బొమ్మనహాళ్, జనవరి 21: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ సమీపంలో బళ్లారి, కళ్యాణదుర్గం రహదారిపై ఆదివారం వేకువజామున భారీ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కర్ణాటకలోని తోరణగల్లు జిందాల్ ఫ్యాక్టరీ స్లాగ్ పోడర్ లోడింగ్ చేసుకొని హిందూపురానికి వెళుతున్న (కేఏ 34సి 8881) నంబరు గల లారీ మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ సమీపంలో తెల్లవారుజామున అదుపుతప్పి పక్కన ఉన్న మాగాణిలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ బబ్లుసింగ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీ బోల్తా పడటంతో విద్యుత్ స్తంభం కూలిపోయింది. ఈ సమయంలో కరెంట్ సరఫరా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు అన్నారు. సమాచారం అందుకున్న బొమ్మనహాళ్ పోలీసులు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

టీడీపీ గెలుపునకు యువత కృషి చేయాలి


మాజీ మంత్రి కాలవను కలిసిన బ్రహ్మసముద్రం టీడీపీ యువత

కణేకల్లు, జనవరి 21: వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపులో యువత భాగస్వాములు కావాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన దాదాపు 100 మంది యువత మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును కలిశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో స్తబ్దుగా ఉన్న యువకులు టీడీపీలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా నిండా ముంచిందని టీడీపీ అధికారంలోకి వస్తే ఉద్యోగాలు విరివిగా వస్తాయన్నారు. బ్రహ్మసముద్రం గ్రామానికి చెందిన పలువురు యువకులు పాల్గొన్నారు.

విధ్వంసానికి ప్రతిరూపం.. వైసీపీ పాలన

బొమ్మనహాళ్, జనవరి 21: జగన్‌రెడ్డి పాలన అంతా దోపిడీ, దౌర్జన్యాలు, విధ్వంసానికి ప్రతిరూపమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరోసభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఈ పరిస్థితిలో చంద్రబాబు పాలన ఎంతో అవసరమని కాలవ అన్నారు. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేని స్థితికి జగన్‌రెడ్డి తీసుకొచ్చారని మండిపడ్డారు.

టీడీపీతోనే బడుగుల అభ్యున్నతి

పామిడి, జనవరి 21: తెలుగుదేశంపార్టీతోనే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యపడిందని గుంతకల్లు మాజీ శాసనసభ్యుడు ఆర్ జితేంద్ర గౌడ్ అన్నారు. పట్టణంలోని మాజీ ఎంపీపీ అంజనేయులుగౌడ్ స్వగృహంలో ఆదివారం జయహో బీసీ కార్యక్రమంపై మాజీ ఎమ్మెల్యేతో పాటు ఆయన కుమారుడు ధర్మతేజగౌడ్ తెలుగు తమ్ముళ్లతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు ఐక్యతతో 24వ తేదీన పామిడిలో జరగబోయే జయహో బీసీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లా శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌస్‌పీరా, తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్లు వైయూ రామాంజనేయులు, చెన్నవరం మహబూబ్‌బాషా, టీటీ రమణారావు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్, ముస్లిం మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్‌రఫీ, ఎస్సీ అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శివశంకర్, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వడ్డే శివకుమార్, పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, నాయకులు నారాయణ స్వామి, సుదర్శన్‌బాబు, రంగస్వామియాదవ్, గాదిలింగ, యుగంధర్, మాధవ, వెంకట రమణ, సుంకప్ప, చీమలరామయాదవ్, మాబు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..: అధైర్య పడవద్దని అండగా ఉంటామని గుంతకల్లు మాజీ శాసనసభ్యుడు ఆర్ జితేంద్రగౌడ్ విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్‌ను ఓదార్చారు. విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ ఇటీవల ఓ శస్త్ర చికిత్స చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న జితేంద్రగౌడ్, అతని కుమారుడు ధర్మతేజగౌడ్ అతని ఇంటికి వెళ్లి పరామర్శించారు. టీడీపీ బలోపేతానికి కుమార్ చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు.

న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు


గుత్తిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గుత్తి, జనవరి 21: తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపమని అంగన్‌వాడీ వర్కర్లు అన్నారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరింది. అంగన్వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం 41వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు లెనిన్ శత వర్ధంతిని నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తొగటవీర క్షత్రియ యువజన కార్యదర్శిగా విక్రమ్

యాడికి, జనవరి 21: తొగటవీర క్షత్రియ రాష్ట్ర యువజన కార్యదర్శిగా యాడికికి చెందిన తాండ్ర విక్రమ్ నియమితులయ్యారు. సత్యసాయి జిల్లా ధర్మవరంలో ఆదివారం నిర్వహించిన తొగటవీర క్షత్రియ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో తనను కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు మోడం వీరాంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారన్నారు. తన ఎన్నికకు సహకరించిన పుట్లూరు రామకృష్ణ, అరుణ్‌బాబులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రేపు ప్రైవేట్ పాఠశాలలకు సెలవు

గుంతకల్లుటౌన్, జనవరి 21: గుత్తి డివిజన్‌లోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు మంగళవారం సెలవు దినంగా ప్రకటించినట్లు ఎంఈఓ మస్తాన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం కాంపెన్సేటరీ సెలవు దినంగా ప్రకటించారన్నారు. ఆ రోజు జరగాల్సిన ఎఫ్ఏ-3 పరీక్షలు 31వ తేదీన నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఈ ఆదేశాలు కేవలం గుత్తి డివిజన్‌లోని ప్రైవేట్ పాఠశాలలకు మాత్రమే వర్తిస్తాయన్నారు.

ప్రకటన

కుమ్మేత భాస్కర్ రెడ్డి S/o K.P. చెన్నారెడ్డి,D.No.1-23 రామరాజుపల్లి గ్రామం, పామిడి మండలం వారికి సంబంధించిన రామరాజుపల్లి గ్రామ పంచాయతీలో సర్వే నెంబర్. 102-B లో 9సెంట్ల భూమిని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:- తూర్పు: కె.భాస్కర్ రెడ్డి భూమి, **పడమర:** బి. విజయ భాస్కర్ రెడ్డి భూమి మరియు దేవేంద్రా రెడ్డి భూమి, **ఉత్తరం:** బండిరస్తా, **దక్షిణము:** బండిరస్తా.

M.G. భాస్కర్‌గౌడ్
అడ్వకేట్, గుంతకల్లు

ప్రకటన

B ఎర్రిస్వామి, S/o B. లింగప్ప, కళ్యాణదుర్గం, Doc.No 3162/2017, SyNo 337/1A లో ప్లాట్‌నెం. 37ను రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల 7రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు : తూర్పు: 25 అడుగుల రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం.48, **ఉత్తరం :** ప్లాట్ నెం.38, **దక్షిణం :** మల్లికార్జున భూమి.

K.మల్లికార్జున,అడ్వకేట్, కళ్యాణదుర్గం.

ప్రకటన

D మారుతమ్మ, W/o D. రమేష్, పేరూరు గ్రామం, రామగిరి మండలం, Doc.No 420/2023, SyNo 188/1A1A2A1 లో ప్లాట్‌నెం. 40ను రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల 7రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు : తూర్పు: 15 అడుగుల వెడల్పు గల రోడ్డు, **పడమర:** ప్లాట్ నెం.41, **ఉత్తరం :** 15 అడుగుల వెడల్పు గల రోడ్డు, **దక్షిణం :** ప్లాట్ నెం.50.

K.మల్లికార్జున,అడ్వకేట్, కళ్యాణదుర్గం.

ప్రకటన

M.సక్కమ్మ, W/o H. చెన్నమల్లప్ప, సుగేపల్లి గ్రామం, బ్రహ్మసముద్రం మండలం, అనంతపురం జిల్లా. Doc.No 5105/2023, SyNo 402 లో ఇంటి నెంబర్ 3/01ను రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల 7రోజులలోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు : తూర్పు: రస్తా, **పడమర:** మిగిలిన భూమి, **ఉత్తరం:** కురుబ చిక్కులింగప్ప జేనుమట్టం, **దక్షిణం :** సత్యప్ప స్థలం.

K.మల్లికార్జున,అడ్వకేట్, కళ్యాణదుర్గం.



గుంతకల్లులో శ్రీకోదండ రామస్వామి ఆలయం, గుత్తిలో విద్యుద్దీపాలంకరణలో శ్రీరాముని ఆలయం


బెళుగుప్పలో ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ముస్తాబైన శ్రీరాముని ఆలయాలు

అయోధ్యలో సోమవారం జరగనున్న బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని జిల్లాలోని పలు రామాలయాలు ముస్తాబయ్యాయి. ఆదివారం ఆలయాలను విద్యుత్ దీపాలతో, మామిడి తోరణాలతో నిర్వాహకులు ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



కణేకల్లులో ప్రత్యేక అలంకరణలో పట్టాభి సీతారామస్వామి, యాడికిలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ హనుమ ఉత్సవమూర్తులు


తాడిపత్రిలో విశేషంగా ఆకట్టుకుంటున్న శ్రీరామచంద్రుని విగ్రహం